క్లుప్తంగా

సోమేశ్వరునికి లక్ష పత్రి పూజ


సోమేశ్వరస్వామికి లక్షపత్రి పూజ చేస్తున్న అర్చకుడు

పెదపూడి: ప్రాచీన చరిత్ర ఉన్న గ్రామంలోని శ్యామలాంబ సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా లక్షపత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొమ్మాళ్లపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో 15 మంది రుత్విక్కులు స్వామివారికి పంచామృతాభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సిద్ధి వినాయకుడికి పంచామృతాభిషేకాలు


సంపరలో ప్రత్యేకాలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: మాఘ మాసం పౌర్ణమి బుధవారం సందర్భంగా సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకునికి గరికిపూజ, పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


ఘనంగా పాశాలమ్మ గ్రామోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో పాశాలమ్మ గ్రామోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు పసుపు నీళ్లు చల్లి, కుంకుమ పెట్టి అమ్మవారికి ఆహ్వానం పలికారు. ఆలయం వద్ద ఉదయం ప్రారంభమైన గ్రామోత్సవం గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది.

నేడు విగ్రహ ప్రతిష్ఠ

ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు గురువారం పాశాలమ్మ వారి నూతన విగ్రహం, ఆలయ శిఖరం, యంత్రి ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేశారు.

త్రిమూర్తులు తీర్థమహోత్సవాలు ప్రారంభం


ఆలయంలోని త్రిమూర్తులు స్వాముల విగ్రహాలు

రాజానగరం: నరేంద్రపురంలో పంట పొలాల మధ్య కొలువైన త్రిమూర్తులు (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు) 78వ తీర్థ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. గ్రామంలోని పంట పొలాల మధ్య స్వయంభూగా వెలిసిన స్వామి వార్లను దర్శించుకునేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. దానికి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ ఐదు రోజులూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.

'నన్నయ'లో ఎన్నికల ప్రచారం

రాజానగరం: శాసన మండలిలో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా పోటీలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్ ఆదికవి నన్నయ యూనివర్సిటీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధ్యాపకులను, విద్యార్థులను కలుసుకుని, తనకు ఓటు చేసి గెలిపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మద్దతుదారులున్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు


సారా, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

రంగంపేట: పెద్ద దొడ్డిగుంట గ్రామంలో సారా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో గ్రామానికి చెందిన చెలబోయిన వీరబాబును అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

అనకొండలు

- గ్రామాల్లో కరిగిపోతున్న కొండలు
- అక్రమంగా మట్టిని తరలిస్తున్న మాఫియా
- కూటమి నాయకుల అండదండలు!

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలో కొండలు కరిగిపోతున్నాయి. కొందరు అక్రమార్కులు అనకొండల్లా మారి వీటిని మింగేస్తున్నారు. కొండలను తవ్వేసి మట్టిని అమ్ముకుంటున్నారు. నిత్యం భారీ లారీలపై తరలిస్తూ కాసులు మూటగట్టుకుంటున్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు ఎడవ కాలువ, పుష్కర కాలువలు ఇరువైపులా ఉన్న మట్టిని భారీ వాహనాల్లో తరలించుకుపోతున్నారు. ఈ దందాను అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమార్కుల ఆగడాలు

కోరుకొండ మండలంలోని కొండలపై అక్రమార్కుల కన్ను పడింది. శ్రీరంగపట్నం, కణుపూరు, కోటికేశవరం, కాటవరం, పురుషోత్తపట్నం, రాఘవపురం, కలవచర్ల తదితర గ్రామాల్లోని కొండలన్నీ కరిగిపోతున్నాయి. ప్రకృతి పరంగా ఏర్పడిన కొండలకు రక్షణ లేకుండా పోయింది. వీటితో పాటు చెరువుల్లోని మట్టిని కూడా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలోని నాయకుల అండదండలతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.

భారీ వాహనాల్లో తరలింపు

సుమారు 10 నుంచి 16 చక్రాలున్న భారీ వాహనాల్లో మట్టిని తరలిస్తున్నారు. వీటిలో 15 నుంచి 18 టన్నులు మాత్రమే లోడు చేయాల్సి ఉండగా, 20 నుంచి 30 టన్నుల మట్టిని వేస్తున్నారు. లెక్కా పత్రం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్నారు. భారీ వాహనాలు, యంత్రాలను వినియోగించడంతో గంటల్లోనే మట్టికొండ మాయమవుతోంది.

రక్షణ కరువు

సీతానగరం మండలంలోని గోదావరి నుంచి విశాఖపట్నం వైపునకు ఏర్పాటు చేసిన పోలవరం లెఫ్ట్ కెనాల్, పుష్కర కాలువలకు ఇరువైపులా ఉన్న మట్టి మాయమైంది. ఆ సమీపంలోని మట్టిని కూడా అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. కాలువలకు ఇరువైపులా ఉన్నమట్టిని తరలించడంతో ఎటువంటి ప్రమాదాలు వస్తాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి ఉపయోగపడే చెరువులు, ప్రభుత్వ భూములను సైతం విడిచి పెట్టకుండా మట్టి మాఫియా టన్నుల కొద్దీ మట్టిని తరలిస్తోంది. రాత్రి సమయంలో ఈ అక్రమ దందా యథేచ్ఛగా జరుగుతోంది.

యథేచ్ఛగా దోపిడీ



కూటమి నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా దోపిడీ జరుగుతోంది. రాత్రి వేళల్లో కొండలను తవ్వేసి మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ సమయంలో వేగంగా వాహనాలు నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మారుమూల గ్రామాల్లో భారీ వాహనాలు తిరగడంతో ప్రజలకు బెంబేలెత్తిపోతున్నారు.

– నక్కా రాంబాబు, గుమ్ములూరు సర్పంచ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

మట్టి మాఫియా



ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండలపై మట్టి మాఫియా కన్ను పడింది. కొండలతో పాటు కాలువ గట్లను కొల్లగొడుతూ అక్రమంగా కాసులు సంపాదిస్తున్నారు. మట్టి మాఫియాను నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి కొండలను కాపాడుకోవాలి.

– ఏడిద ప్రసన్నకుమార్, యువ నాయకుడు, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ సంస్థ


శ్రీరంగపట్నంలో అక్రమార్కులు తవ్వేసిన కొండ


మట్టిని తరలిస్తున్న భారీ వాహనం


కోరుకొండ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న లేఅవుట్‌లో వేసిన పోలవరం కాలువ గట్టు మట్టి

ఘనంగా లక్ష్మీనరసింహునికి శ్రీచక్రస్నానం


పుట్టకొండలో స్వామివారికి శ్రీచక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

పెదపూడి: మండలంలోని పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి శ్రీచక్రస్నానం ఘనంగా చేయించారు. అర్చకులు గోపాలాచార్యులు, ఇతర పండితులు ఉదయం 8 గంటలకు స్వామివారికి పూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రతీర్థం, రాత్రి 7 గంటలకు బలిహరణం, ధ్వజపట ఉద్వాసన చోరోత్సవం, తిరుమంగై యాళ్వర్ల వైభవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ, సర్పంచ్ వల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. ఇలాఉండగా ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద సుమారు 5 వేల మంది భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు, గంగ్రేడు, కుమారప్రియం, జి.మామిడాడ, చింతపల్లి, సంపర, కై కవోలు, పెదపూడి తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరయ్యారు.

దుర్గాదేవి ఆలయ మంటపానికి శంకుస్థాపన


కరకుదురులో మంటపానికి శంకుస్థాపన చేస్తున్న ప్రముఖులు

పెదపూడి: ఆలయాల అభివృద్ధికి దాతలు, భక్తులు సహకరించి, వారి దాతృత్వాన్ని చాటుకోవాలని మాజీ సర్పంచ్ సింగిసీడి నాగతిరుపతిరావు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ ఉండ్రు సత్యనారాయణ అన్నారు. కరకుదురు గ్రామంలో బుధవారం దుర్గాదేవి ఆలయం మొదటి అంతస్తు మంటపం నిర్మాణానికి గ్రామానికి చెందిన మర్రెడ్డి వీర్రాజు, తేజస్విని దంపతులు రూ.7.30 లక్షల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మంటప నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తోటకూర శ్రీను, పాటంశెట్టి కాశీరత్నం, మాజీ ఉప సర్పంచ్ పాటంశెట్టి త్రిమూర్తులు, యెండ్రు వీర్రాజుచౌదరి, సానా రాంబాబు, కర్రెడ్ల వెంకన్నబాబు, సానా వీర వెంకట సత్యనారాయణ, ఉండ్రు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూతో భయం భయం


మిర్తిపాడులో బర్డ్‌ఫ్లూ వచ్చిన కోళ్లఫారానికి వెళ్లే దారిని మూసివేసిన దృశ్యం


కోళ్లఫారం యజమాని, సిబ్బందిని పరిశీలిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య

- మిర్తిపాడులో నిషేధాజ్ఞలు
- కోడిమాంసం దుకాణాల బంద్
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య సిబ్బంది
- అప్రమత్తమైన అధికారులు

సీతానగరం: మిర్తిపాడులోని కోళ్లఫారంలో బర్డ్ ఫ్లూ ప్రబలిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. రెండు రోజుల క్రితం మిర్తిపాడులోని మార్ని సత్యనారాయణ కోళ్ల ఫాంలో సుమారు 8 వేల కోళ్లు చనిపోయాయి. జిల్లాలోని పెరవలి మండలంలో బర్డ్ ఫ్లూ వచ్చిందని నిర్ధారణ అయిన తర్వాత కలెక్టర్ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. మిర్తిపాడు కోళ్ల ఫారం నుంచి శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించగా ఆ వ్యాధి నిర్ధారణ అయ్యింది. దీనితో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య, పశు వైద్యులు డాక్టర్ ఫణీంద్ర, ఎస్సై రామ్ కుమార్ తదితరులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. చనిపోయిన కోళ్లను గోతుల్లో వేయించి, మట్టితో మూయించారు. పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య ఆ గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. కోళ్ల ఫారంలో ఉన్న ముగ్గురి నుంచి శాంపిళ్ల సేకరించి ల్యాబ్‌కు పంపించగా ఎటువంటి లక్షణాలు లేవని తెలిపింది. రొంప, దగ్గు, ఒకేసారి జ్వరం రావడం, ఒళ్లు నొప్పులు బర్డ్‌ఫ్లూ లక్షణాలని, దీనిపై ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తున్నారని పీహెచ్‌సీ డాక్టర్ చైతన్య తెలిపారు. మండల గ్రామాల్లో చికెన్ దుకాణాల్లో కోడి మాంసం, కోడిగుడ్ల అమ్మకాలు నిషేధించారు.

వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

సీతానగరం: ప్రభుత్వ భూముల్లో ఇళ్లను నిర్మించుకున్న వారందరూ దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోను అభ్యంతరకరం లేని ప్రభుత్వ భూముల్లో 2019 అక్టోబర్ 15 నాటికి ఇంటిని నిర్మించుకుని, నివాసం ఉంటున్న బీపీఎల్ కుటుంబాలకు ప్రభుత్వ స్థలం 150 గజాల మేరకు ఉచితంగా హక్కులు కల్పించేలా ప్రభుత్వ చర్యలు తీసుకుందన్నారు. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్ 30ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కావున అర్హులైన వారు తగిన దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఆయా గ్రామాల్లోని వీఆర్వోలను సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్య కల్యాణం


సూర్యకల్యాణం నిర్వహిస్తున్న వడలి కుమార్‌శర్మ

రాజమహేంద్రవరం రూరల్: మాఘ మాసాన్ని పురస్కరించుకుని కొంతమూరు పద్మాక్షి నగర్‌లో వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత చండీ సూర్యారాధన ఘనంగా ముగిసింది. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి సామూహిక సూర్య కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 4వ తేదీ నుంచి ప్రతిరోజు సూర్య నమస్కారాలు, శత చండీ హోమాలు, మహాలక్ష్మి ఆరాధన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల ముగింపులో భాగంగా 11.30 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా వడలి కుమార్ శర్మ మాట్లాడుతూ భక్తులందరికీ అమ్మవారి కరుణ ఉండాలని ఆకాంక్షించారు. సూర్య ఆరాధన ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు లభిస్తాయన్నారు. తామర పువ్వులతో మహాలక్ష్మి హోమం నిర్వహించినట్టు తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో ప్రయోజనాలు


ముగ్గళ్ల రైతు సేవా కేంద్రంలో రైతుల వివరాల నమోదును పరిశీలిస్తున్న ఏవో సూర్య రమేష్

సీతానగరం: మండలంలోని రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్య రమేష్ సూచించారు. మునికూడలి, ముగ్గళ్ల, కూనవరం, వంగలపూడి, రఘుదేవపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి ఉన్న ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయించడం ద్వారా వ్యవసాయ సేవలు సులభతరమవుతాయన్నారు. ముందుగా రిజిస్ట్రీ పోర్టల్‌లో వివరాలు నమోదు చేస్తారన్నారు. అనంతరం ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారని తెలిపారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, సేవలను పొందవచ్చన్నారు. ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లతో సమీపంలోని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలని రైతులను కోరారు.

150 కిలోలకు మించకుండా పొగాకు బేళ్లు కట్టాలి


కాటవరం బ్యారన్ వద్ద క్యూరింగ్ పొగాకును పరిశీలిస్తున్న ఆర్ఎం ప్రసాద్, ఏఎస్ స్మిత

సీతానగరం: వర్జీనియా పొగాకు బేళ్లను 150 కిలోలకు మించకుండా కట్టాలని రైతులకు రాజమహేంద్రవరం ప్రాంతీయ అధికారి (టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్) జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. నల్లరేగడి నేలలైన మిర్తిపాడు, కాటవరాల్లో ఆర్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో టుబాకో బోర్డు వేలం నిర్వహణాధికారి పి.హేమ స్మిత, ఐటీసీ శాస్త్రవేత్త డాక్టర్ ఉమా మహేష్, పలు కంపెనీల ప్రతినిధులు బుధవారం క్యూరింగ్, గ్రేడింగ్‌లను ఫీల్డ్ ఫ్రెండ్స్ టీమ్‌గా పరిశీలించారు. రీజినల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ బ్యారన్ క్యూరింగ్‌లో గొట్టాలు మీద ఆకులు రాలకుండా జల్లెడ అమర్చాలని సూచించారు. క్యూరింగ్‌లో క్యూరోమీటర్లు తప్పకుండా వాడాలని, గ్రేడింగ్‌లో అన్య పదార్థాలు కలవకుండా బుట్టలు ఉపయోగించాలని, తేమశాతం చూసుకుని పొగాకు మండెలు తిరగ వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎస్ఎస్, జీపీఐ కంపెనీల ప్రతినిధులు జె.రఘురామ్ ప్రసాద్, బి.రవి, పీఎస్ఎస్ కంపెనీ బయ్యర్ టి.సీతారామరాజు, ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ కుమార్ ప్రజాపతి, ఫీల్డ్ అసిస్టెంట్లు బి.రాజేష్, వినోద్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

సాక్షి ఇంపాక్ట్


ముగ్గళ్ల కల్వర్టు వద్ద జరుగుతున్న తారు రోడ్డు పనులు

సీతానగరం: కాతేరు – సీతానగరం నాలుగు లైన్ల రోడ్డులో కల్వర్టుల వద్ద ఇరువైపులా ఉన్న రోడ్లను ఆర్‌అండ్‌బీ అధికారులు విస్తరిస్తున్నారు. ఈ మేరకు బుధవారం ముగ్గళ్ల కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్డును కలిపారు. ఈనెల 2వ తేదీన సాక్షి పత్రికలో ‘బాటలపై బూటకం’ అనే శీర్షికతో కథనం వెలువడింది. కాటవరం, మునికూడలి, ముగ్గళ్ల కల్వర్ల రోడ్లను కలపకుండా వదిలేయడంతో వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులు తెలియజేస్తూ వార్త వచ్చింది. ఈ మేరకు ముగ్గళ్ల కల్వర్టు వద్ద సిమెంట్ రోడ్డును, కల్వర్టు మరో పక్కన గల తారురోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మిస్తున్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజానగరం: దివాన్ చెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ విద్యుత్ ఫీడర్లపై మరమ్మతుల కోసం శుక్రవారం సరఫరాకు అంతరాయం కలుగనుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దివాన్ చెరువు, శ్రీరామపురం, పాలచర్లలోని అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లకు సరఫరాను నిలిపివేస్తామన్నారు.

దోమల నివారణకు మందు పంపిణీ


కరకుదురులో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న కార్మికుడు

పెదపూడి: గ్రామాల్లో దోమల నివారణకు సచివాలయ కార్యదర్శులు ఎబేట్ మందును మురుగు కాలువల్లో పిచికారీ చేయించాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి, దోమాడ, కరకుదురు, ఏపీత్రయం గ్రామాల్లో బుధవారం ఆయన దోమల నివారణ చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేలా దోమల నివారణకు ఎబేట్ మందుతో పాటు, నువాన్, మిలాథిన్, డీజిల్, ఫినాయిల్ కలిపిన మిశ్రమాన్ని విస్తృతంగా పిచికారీ చేయిస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ఈ మిశ్రమం పిచికారీ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు భోగరాజు ప్రసన్నాంజనేయులు, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, డి.ఉషారాణి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లతో పారిశుధ్య పనులు


పేకాటలో పట్టుబడిన వారితో ఆర్‌బీకే పరిసరాలను శుభ్రం చేయిస్తున్న సీఐ సత్య కిషోర్

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి రైతు భరోసా కేంద్రం వద్ద పేకాటాడిన వారితో అక్కడి పరిసరాలను శుభ్రం చేయించారు. సీఐ సత్యకిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మంగళవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా రైతు భరోసా కేంద్రం వద్ద పేకాట ఆడుతూ కొందరు కనిపించారు. అక్కడ ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో నలుగురు పరారయ్యారు. దీంతో బుధవారం మొత్తం ఏడుగురిని పట్టుకుని కేసు నమోదు చేశారు. అలాగే నిందితులతో ఆ ప్రదేశంలోని మద్యం సీసాలు, చెత్తను శుభ్రం చేయించారు.

ఘనంగా రుద్ర హోమం


రంగంపేటలో రుద్ర హోమంలో పాల్గొన్న మహిళలు

రంగంపేట: గ్రామంలోని ఉమారామలింగేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా రుద్ర హోమం జరిగింది. ఆలయ అర్చకుడు మైలవరపు నాగేంద్ర ఆధ్వర్యంలో మాఘ పూర్ణిమ సందర్భంగా ఉదయం 8 గంటలకు రుద్ర హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు హోమంలో పాల్గొని, పూజలు చేశారు. అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పార్వతీదేవికి ప్రత్యేకాలంకరణ


బిక్కవోలులో ప్రత్యేకాలంకరణలో పార్వతీదేవి అమ్మవారు

బిక్కవోలు: మాఘ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామంలోని పార్వతీదేవి అమ్మవారికి బుధవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పురాతన ఆలయాల అభివృద్ధే లక్ష్యం

మధురపూడి: పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేనను ఏర్పాటు చేసినట్టు ఆ సంస్థ అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. కోరుకొండ మండలం బొల్లెద్దు పాలెంలో బుధవారం జరిగిన షిర్డీ సాయి మందిర 8వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అన్నసమారాధనకు రూ.10,116 విరాళం అందజేశారు, అనంతరం రాజానగరం మండలం నరేంద్రపురంలో జరిగే త్రిమూర్తులుస్వామి కల్యాణోత్సవాలకు హాజరయ్యారు. అక్కడ నిర్వహించే అన్నసమారాధనకు రూ.1,00,000 విరాళాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు.

పశు గ్రాసంగా జనుము


చంద్రేడు వద్ద పొలంలో రైతులు వేసిన జనుము

రంగంపేట: మెట్ట ప్రాంతంలో పాడి పశువులకు పశుగ్రాసంగా రైతులు జనుమును పండిస్తున్నారు. వేసవిలో పశువులకు మేత కొరత తీవ్రంగా ఉంటుంది. దీనిని అధిగమించడానికి రైతులు ఖరీఫ్ సీజన్ అయిన తరువాత వరి కోతల అనంతరం పొలాల్లో జనుము విత్తనాలు చల్లుతున్నారు. పొలాల గట్లపై కూడా జనుము విత్తనాలు వేస్తున్నారు. యంత్రాలు వచ్చాక వరి కుప్పలు వేయకుండా, మెషీన్ల ద్వారా వరి కోతలు కోయడంతో ఎండుగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. దీంతో జనుమును వేస్తున్నారు. జనుమును పశువులకు పచ్చి దాణాగాను, ఎండబెట్టి వేసవి కాలంలోనూ పశువులకు పశుగ్రాసంగా ఉపయోగిస్తున్నారు. జనుమును పశువులు కూడా ఇష్టంగా తింటాయని రైతులు చెబుతున్నారు.